## క్లుప్తంగా

### క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తాం


భూసమస్యలు వింటున్న ట్రైనీ కలెక్టర్ వినూత్న

**కూడేరు:** భూ సమస్యలను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి, పరిష్కారానికి కృషి చేస్తామని ట్రైనీ కలెక్టర్ వినూత్న తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు సమస్యలపై వినతులు అందించారు. స్పందించిన ట్రైనీ కలెక్టర్ .. అధికారులను పిలిచి భూ సమస్యల రికార్డులు సిద్ధం చేయాలని, తానే ఫీల్డ్‌కు వెళ్లి రికార్డుల మేరకు భూమిని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. డీటీ సూర్యప్రతాప్, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఏపీఓ తులసీ ప్రసాద్, పీఆర్ ఏఈ రమణయ్య, ఏఎస్ఐ రామానాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగ దివ్య, ఏసీడీపీఓ ఎల్లమ్మ పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక


జ్యోతికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**శెట్టూరు:** మండలంలోని కనుకూరు ఉన్నత పాఠశాలకు చెందిన కె.జ్యోతిక జాతీయ స్థాయి టెన్నికాయిట్ క్రీడలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయులు సుధ, పీడీ అమరాంజనేయులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా చాట్యాలలో ఈ నెల 21 నుంచి 22 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ క్రీడలో ప్రతిభ కనపరిచిన జ్యోతిక, జాతీస్థాయి క్రీడలకు ఎన్నికై నట్లు తెలిపారు. ఒరిస్సాలోని కటక్‌లో జరగనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీలలో రాష్ట్ర టెన్నికాయిట్ జట్టులో జ్యోతిక పాల్గొననున్నట్లు వారు తెలిపారు. సోమవారం పాఠశాలకు వచ్చిన 8వ తరగతి జ్యోతికను పాఠశాలలో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

### దిగజారుడు రాజకీయాలు చేస్తే చర్యలు

**బొమ్మనహాళ్:** వైఎస్సార్‌సీపీకి నమ్మకం ద్రోహం చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్.రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని కొందరు నాయకులు వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త మెట్టు గోవిందరెడ్డిపై కుట్రపూరితంగా దుష్ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొందరు పార్టీ సానుభూతి పరులను పార్టీ నుంచి వేరే పార్టీలోకి చేర్పించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పార్టీపై దుష్ప్రచారం చేస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. పార్టీ కార్యకలాపాలకు విరుద్ధంగా ఎవరు నడుచుకున్నా.. చర్యలు తప్పవని హెచ్చరించారు.

### పింఛన్ల తొలగింపునకు చర్యలు

**ఉరవకొండ:** ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక సదరం క్యాంపు ఏర్పాటు చేసి పింఛన్ల తొలగింపునకు చర్యలు చేపట్టారు. సోమ వారం శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు లక్ష్మీరామ్ ఆధ్వర్యంలో పింఛన్ పొందుతున్న దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించారు. సదరం క్యాంపులో వారికి మంజూ రు చేసిన సర్టిఫికెట్లు, దివ్యాంగ శాతాన్ని పరిశీలించారు. ఈక్యాంపులో దాదాపు 50 శాతం మందిని అనర్హులుగా గుర్తించి, వారి పింఛన్‌లు తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

### వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న సర్పంచు

**బ్రహ్మసముద్రం :** పదోతరగతి పరీక్షలు బాగా రాసి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. సోమవారం మండలంలోని గుండిగానిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. బైరవానితిప్ప గ్రామ సర్పంచ్ శెట్టిగారి మంజునాథ పదో తరగతి విద్యార్థులు 60 మందికి పరీక్ష సామగ్రి అందించారు. ఇంగ్లిష్ టీచర్ లేక పోవడంతో ట్యూటర్‌ను నియమించి, నెలకు రూ.12 వేలు చొప్పున వేతనం అందించారు.

**జెడ్పీ ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజ**

**ఉరవకొండ:** స్థానిక పాతమార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థినులు ఘనంగా సరస్వతీ పూజ చేశారు. పాఠశాల ఆవరణలోని సరస్వతీ విగ్రహానికి పదో తరగతి విద్యార్థినులు పూలమాల వేసి, పూజలు చేశారు. అనంతరం పాఠశాల హెచ్ఎం అనితకుమారి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థినులు సత్తా చాటి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

---

విశిష్ట సంఖ్య నమోదులో రైతులకు సాంకేతిక చిక్కులు తప్పడంలేదు. భూమి కలిగిన రైతుల కోసం ప్రత్యేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ పేరుతో 11 అంకెల విశిష్ట గుర్తింపు నంబరు కేటాయించడానికి ఈనెల (ఫిబ్రవరి) 7న ఆర్ఎస్‌కేల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. సర్వర్ సతాయిస్తుండడంతో రైతులు రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. దీనికితోడు ఒకే సర్వేనంబర్‌లో ఎక్కువ మంది పేర్లున్నా, డీ పట్టా రైతులకు ఆప్షన్ కనిపించక ఆందోళన పడాల్సి వస్తోంది.

– రాయదుర్గం/ఉరవకొండ:

# విశిష్ట సంఖ్యకు.. సాంకేతిక చిక్కులు


రాయదుర్గంలో విశిష్ట సంఖ్య నమోదుకు పడిగాపులు కాస్తున్న రైతులు

- అన్నదాతలకు తప్పని తిప్పలు
- ఆర్ఎస్‌కేల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- డీ పట్టా రైతులకు కనిపించని ఆప్షన్
- ఒకే సర్వే నంబరులో ఎక్కువ మంది పేర్లున్నా అంతే..
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో తప్పని అవస్థలు


ఉరవకొండ ఆర్ఎస్‌కే కార్యాలయానికి యూనిక్ నంబర్ రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులు

**రిజిస్ట్రేషన్‌లో ఎదురవుతున్న సమస్యలు ఇవే..**

- ఒకే సర్వే నంబర్‌లో అన్నదమ్ములు ఉన్నట్లయితే ఒకే పేరు వస్తోంది.
- ప్రస్తుతం భూమిలో ఒకే రైతుకు సంబంధించి వివరాలు పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి.
- డి.పట్టా, దేవదాయ, ప్రభుత్వ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కావడం లేదు.
- ఆధార్ నంబర్లు సక్రమంగా లేక రైతులకు అవస్థలు తప్పడంలేదు.
- రైతుల వివరాలు నమోదు చేసిన మొబైల్‌కు మెసేజ్ రావడానికి గంటల సమయం పడుతోంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 1,48,831 మంది రైతులు ఉన్నారు. ఇప్పటి వరకు 28,715 మందికి మాత్రమే విశిష్ట సంఖ్య (ఆధార్ నంబర్) తరహా గుర్తింపు నంబర్ అందించారు. మిగిలిన వారి వివరాలు నమోదుకు సిబ్బంది తంటాలు పడుతున్నారు. సాంకేతిక సమస్యతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్ఎస్‌కే సిబ్బంది నిర్లక్ష్యంతో రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

**సంక్షేమ పథకాలకు విశిష్ట సంఖ్య లింకు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే రాయితీలు ఇకమీదట ఏది పొందాలన్నా రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరి చేశారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్సులతో పాటు సెల్‌ఫోన్ నంబర్‌ను వీఆర్ఏకు అందించాలి. రైతు వివరాలను వీఏఏ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రైతు సెల్‌కు ఓటీపీ వస్తోంది. వీఏఏ లాగిన్‌లో రైతుల వివరాలు సరిచూస్తారు. అన్నీ సక్రమంగా ఉంటే ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. దీంతో పేర్లు నమోదుకు రైతులు కేంద్రాల వద్దకు క్యూకడుతున్నారు. భూమిని నమ్ముకున్న రైతులకు వాతావరణం అనుకూలించక, చీడపీడలతో నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో వారిని ఆదుకునేందుకు క్షేత్రస్థాయిలో కొన్ని అడ్డంకులు ఎదరవుతాయి. బాధితులను గుర్తించేందుకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. దీన్ని అధిగమించేందుకు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ పేరుతో ప్రతి రైతుకూ 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తున్నారు. ఆధార్ ఎంత అవసరమో రైతుకు విశిష్ట సంఖ్య కూడా రెట్టింపు అవసరం అయ్యేలా రూపకల్పన చేశారు.

**వేలిముద్ర, పేషీయాప్‌ను వినియోగించాలి**

ఆధార్ కార్డుకు సెల్‌ఫోన్ నంబర్ అనుసంధానానికి రైతుల పేర్లను ఈకేవైసీ ద్వారా నమోదు చేస్తున్నారు. ఆ తర్వాత ఓటీపీ ద్వారా వీఏఏ లింకు, అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి పంపడంతో జాప్యమవుతోంది. నేరుగా రైతు నుంచి వేలిముద్రలు, లేక ముఖ ఆధారితంగా రైతు వివరాలు నమోదు చేస్తే త్వరగా ప్రక్రియ ముగుస్తుందని రైతులు అంటున్నారు.

**ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు సంఖ్య**

భూమి ఉండే ప్రతి రైతుకు ఆధార్ తరహా విశిష్ట (ప్రత్యేక) గుర్తింపు సంఖ్య కేటాయించేలా కార్యాచరణకు శ్రీకారం చుట్టామని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏడీఏలు లక్ష్మానాయక్, యల్లప్ప తెలిపారు. రైతు వివరాల్లో కొన్ని తప్పుల వల్ల నమోదు ప్రక్రియ కొన్నిచోట్ల జాప్యం జరుగుతోందన్నారు. మరికొన్ని చోట్ల సర్వర్ సమస్య తలెత్తుతోందన్నారు. మరింత మంది సిబ్బందిని నియమించి అయినా ప్రక్రియ సజావుగా పూర్తి చేసేలా కృషి చేస్తామని చెప్పున్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు వేలిముద్ర, ముఖ ఆధారిత డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

**రైతులు, నమోదు వివరాలు**

| నియోజకవర్గం | రైతులు | నమోదైన రైతులు |
|---|---|---|
| రాయదుర్గం | 53,463 | 13,070 |
| కళ్యాణదుర్గం | 52,140 | 5,720 |
| ఉరవకొండ | 43,234 | 9,925 |
| మొత్తం | 1,48,837 | 28,715 |

**మూడు రోజుల నుంచి తిరుగుతున్నా..**



రిజిస్ట్రేషన్ కోసం మూడు రోజుల నుంచి ఆర్ఎస్‌కే వద్దకు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నా పని జరగడం లేదు. అధికారులు కూడా సైట్ ఓపెన్ కావడం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారు.

– షరీఫున్నీసా, రైతు, ఉరవకొండ

**అవస్థలు తప్పడంలేదు**



పొలం పనులు వదిలి రెండు రోజుల నుంచి కార్యాలయం చుట్టూ నంబరు ఇస్తారని తిరుగుతున్నా..ఏం నంబరో అర్థం కావడం లేదు. రోజూ రావడం మిషన్ పని చేయలేదని వాళ్లు చెప్పడం.. నేను ఇంటికి పోవడం ఇదే పనైపోయింది. రైతుల అవస్థలు అధికారులు తెలుసుకోవాలి.

– బోయ ఎర్రిస్వామి, ఉరవకొండ

**వేగవంతం అయ్యేలా చేస్తాం**



ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ యూనిక్ నంబరు రైతులందరికీ తప్పనిసరిగా ఉండాల్సిందే. ఈప్రక్రియ మరింత వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా చర్యలు తీసుకుంటాం. రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు సహకరించాలి.

– పద్మజ, ఏడీఏ, ఉరవకొండ

---

## ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు


ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనాన్ని ప్రారంభిస్తున్న అతిథులు


కూడేరులో పూజలందుకున్న జోడులింగాలు

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కుర్నీ సేవా సమాజం ఆధ్వర్యంలో సోమవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, గంగపూజ, సాయంత్రం అఖండదీప్ప ప్రజ్వలనం, ధ్వజపతాక ఆరోపణ అంకుర్పాణలతో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. 27న గిరిజా కల్యాణోత్సవం జరుగుతుందన్నారు.

**విశ్వశాంతి కోసం ఓంశాంతి కృషి అభినందనీయం..**

విశ్వశాంతి కోసం ఓంశాంతి చేస్తున్న కృషి ప్రశంసనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి స్థానిక ఓంశాంతి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జూనియర్ కళాశాల మైదానంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు, వాయు శివలింగాన్ని దర్శించుకున్నారు. విశ్వ విద్యాలయ సంచాలకులు యోగీశ్వరి, అనంతపురం ఓంశాంతి సంచాలకురాలు శారద, కౌన్సిలర్ గౌని లావణ్య, బీజేపీ నాయకురాలు వసుంధర పాల్గొన్నారు.

**జంబుకేశ్వరస్వామికి విశేష పూజలు**

**రాయదుర్గం** పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు జరిగాయి. అర్చకులు రామకృష్ణస్వామి ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం, ఏకబిల రుద్రాభిషేకం, కుంకుమ అర్చన, మంగళ నైవేద్యాలు చేపట్టారు.

**కూడేరు :** మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి కర్ణాటక రాష్ట్రం బళ్లారి, జిల్లా నలమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

**రేపు ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు**

**బెళుగుప్ప:** మండలంలోని శివాలయాల్లో మహాశివ రాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రాచీన రామేశ్వరాలయంలోనూ పూజలు జరగనున్నాయి. బుధవారం తెల్లవారుజామున 5.30 గంటలకు సుప్రభాత సేవ, 8 గంటల నుంచి 10 గంటల వరకు మహన్యాస పూర్వక, ఏకవార పంచామృత రుద్రాభిషేకాలు, మధ్యాహ్నం 11.08 గంటలకు శివ పార్వతుల కల్యాణోత్సవం, సాయంత్రం 4 గంటలకు స్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం, రాత్రి 11 గంటల నుంచి లింగోద్భవ రుద్రాభిషేకాలు, అనంతరం భజనలు ఉంటాయని దేవదాయశాఖ ఈఓ అక్కిరెడ్డి, సేవా కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ ప్రజలు తెలిపారు. తగ్గుపర్తి ఉమామహే శ్వరాలయం, బూదిగుమ్మ సిద్దేశ్వరాలయం, శీర్పి, దుద్దేకుంట, గంగవరం, నక్కలపల్లి, కాలువపల్లి, జీడిపల్లి, ఎర్రగుడి, హనిమరెడ్డిపల్లి ఆలయాల్లో ఉత్సవాలు జరగనున్నాయి.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


మొబైల్ వాహనం ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**రాయదుర్గంటౌన్:** సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని అర్బన్ సీఐ జయనాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉడేగోళంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు వివిధ విద్యాలయాల్లో సైబర్ సురక్ష డిజిటల్ వాహనం ద్వారా విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మొబైల్ వినియోగంతో సైబర్ నేరాల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు చెప్పారు. తెలియని యాప్‌లు, మెసేజ్‌ల లింకులను ఓపెన్ చేయరాదని సూచించారు. విద్యార్థులు అవగాహన పెంచుకుని సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్త వహించాలన్నారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి**

**బొమ్మనహాళ్:** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాల ఆవరణలో సైబర్ నేరాలపై మొబైల్ వాహనంలో ఎస్పీ వీడియో ద్వారా అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన గ్రామీణులు ఎక్కువగా పడుతున్నారన్నారు. అవగాహన లోపం వల్లే నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ కమలమ్మ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి


వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

**గుమ్మఘట్ట:** ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యులు బాలాజీనాయక్, ట్రైనర్ సుధీర్ తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లకు వడదెబ్బ, ఎండకాలంలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఎండకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మధ్యాహ్న వేళల్లో బయటకు రాకూడదన్నారు. నిమ్మరసం నీళ్లను తాగాలన్నారు. కాటన్ దుస్తులు ధరించాలన్నారు. ఎన్‌సీడీ కేన్సర్ సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి


పార్టీ నేతలతో మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

**రాయదుర్గంటౌన్:** అధికారంలోకొచ్చిన కేవలం 8 నెలల్లోనే పథకాలు అమలు చేయడం చేతకాదని చేతులెత్తేసిన చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన పలువురు పార్టీ మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి అనుబంధ కమిటీ నాయకులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా ఎన్నికైన ఆలేరు రాజగోపాల్‌రెడ్డి హాజరై మెట్టు గోవిందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల పక్షాన ఉండి పోరాడాల్సిన బాధ్యత నూతనంగా ఎన్నికైన కమిటీ నేతలపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజల తరపున పోరాడుతుందన్నారు. ప్రజలకు ఏమైతే మాట ఇస్తారో...ఇది చేసి చూపించడం వైఎస్ జగన్ నైజమన్నారు. ఎన్నికలకు ముందు ఎన్నికల తర్వాత కూడా ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకే దక్కిందన్నారు. అధికారం కోసం రాష్ట్ర ప్రజల్ని మోసం చేశారని, ఇంతకన్నా దారుణం మరొకటి ఉండదన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామాంజనేయులు, కణేకల్లు కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మారెన్న, చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు పొరాళ్ల శివకుమార్, నిజాముద్దీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా కల్పించాలి:**

అసెంబ్లీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కల్పించాలని నియోజకవర్గ సమన్వయ కర్త మెట్టు గోవిందరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 40 శాతం ఓటు షేర్‌తో ఉన్న వైఎస్సార్‌సీపీకి ప్రజల వాణి వినిపించేందుకు అన్ని రకాల అర్హత ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష హోదా దక్కకుండా కుయుక్తులు పన్నుతున్నట్లు తెలుస్తోందన్నారు.

## సంక్షిప్త సమాచారం

**భూతగాదాపై డీఎస్పీ విచారణ**

**కూడేరు:** మండలంలోని కడదరకుంటలో భూ తగాదాపై గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు సోమవారం విచారణ చేపట్టారు. కడదరకుంటలో భూతగాద విషయమై దళితులు రమేష్, పెద్దన్న కుటుంబీకులు, తుప్పటి హరీష్ వర్గీయులు శనివారం ఘర్షణ పడిన విషయం తెలిసిందే. ఆదివారం ఇరువర్గాలు ఫిర్యాదుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు. డీఎస్పీ భూవివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. కేసులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సీఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

**'క్రమబద్ధీకరణ'ను సద్వినియోగం చేసుకోండి**

**బెళుగుప్ప:** క్రమబద్ధీకరణ పథకం కింద ఇంటి పట్టా మంజూరుకు అవసరమైన చర్యలు చేపడతామని తహసీల్దార్ షర్మిళ తెలిపారు. సోమవారం తహసీల్దార్ మాట్లాడుతూ క్రమబద్ధీకరణ పథకం 2025 కింద అభ్యంతరాలు లేని గ్రామకంఠం భూమిలో ఇళ్లు నిర్మించుకున్న వారు ఇంటి పట్టాకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 150 చదరపు గజాలు లోపు ఉన్న వారికి అనుమతులతో పట్టా ఇస్తామన్నారు.

**అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి**


సి.అర్జున్ (ఫైల్)

**వజ్రకరూరు:** మండలంలోని పీసీ ప్యాపిలికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సి.అర్జున్ అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతునికి భార్య పవిత్రమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి వెంటనే ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు. అర్జున్ మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పీసీ ప్యాపిలికి చేరుకొని అర్జున్ మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

**నేడు మున్సిపల్ సమావేశం**

**రాయదుర్గంటౌన్:** రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో 25న ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

**ఘనంగా ఏకాదశి పూజలు**


ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

**బొమ్మనహాళ్:** ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామికి ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. సోమవారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో స్వామివారికి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అభిషేకం చేసి, స్వామి మూలవిరాట్‌కు పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు చేశారు.

**వాటర్‌ప్లాంట్ ఆర్ఓ వితరణ**

**శెట్టూరు:** మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ వసతి గృహానికి సోమవారం వాటర్‌ప్లాంట్ వితరణ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి ఆధ్వర్యంలో ముంబయ్‌కి చెందిన సెంట్రల్ బ్యాంక్ సీఈఓ ఎంవీ రావు వసతి గృహంలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డన్, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి**

**వజ్రకరూరు:** విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు మల్లెల జగదీష్ తెలిపారు. సోమవారం మండలంలోని చాబాల గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సర్పంచు ప్రారంభించారు. గ్రామ కార్యదర్శులు నాగరాజు, చంద్రకళ, డిజిటల్ అసిస్టెంట్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

**ఓబీసీ సర్టిఫికెట్ జారీ చేయండి**

**కళ్యాణదుర్గం రూరల్:** ఉద్యోగుల వార్షిక ఆదాయంతో సంబంధం లేకుండా ఓబీసీ సర్టిఫికెట్ జారీ చేయాలని ఆర్డీఓ వసంతబాబును ఉపాధ్యాయ సంఘం నాయకులు విన్నవించారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

**పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభం**

**కుందుర్పి:** మండల పరిధిలోని ఎనుముల దొడ్డిలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం నూతన భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యులు చాంద్ బేగం రిబ్బన్ కత్తిరించి, ప్రారంభించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఔదార్యం


ఆదర్శ పాఠశాలలో పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

**వజ్రకరూరు:** మండల కేంద్రంలోని కేవీ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఔదార్యం చాటారు. సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాల(మోడల్)లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎగ్జామ్ ప్యాడ్స్, జామెంట్రీ బాక్సులు 150 మంది విద్యార్థులకు అందించారు. సర్పంచు మోనాలిసా, ఎంఈఓ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, ఎంఈఓ ఎర్రిస్వామి, ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్‌హిదాయ్‌తుల్లా, సామాజిక కార్యకర్తలు పట్టా ఖాజీపీరా, బెంజిమెన్, మల్లికార్జున, పూర్వవిద్యార్థులు రమేష్, మన్యం అనిల్, సుకన్య, రామాంజనేయులు, ఎర్రిస్వామి, ధర్మరాజు, రంగస్వామి, హరినాథ్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.